# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్.ఎం.డీ ఫరూక్ పేర్కొన్నారు.
- అరసవిల్లి శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గానికి ఎన్నికల షెడ్యూల్ విడుదలతో ఆయా జిల్లాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్లు తెలిపారు.
- ఈరోజు ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

==========================

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్.ఎం.డీ. ఫరూక్ తెలిపారు. నంద్యాలలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అనువైన భవనాన్ని ఎంపిక చేసేందుకు ఈ నెల 6వ తేదీన హైకోర్టు జడ్జిల బృందం కర్నూలులో పర్యటించనుందని చెప్పారు. కర్నూలు దిన్నె దేవరపాడు వద్ద ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్‌కు చెందిన భవనాన్ని బృందం పరిశీలించనున్నట్టు తెలిపారు. బెంచ్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి వివరించారు.

==========================

అరసవిల్లి శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళంలో రథసప్తమి వేడుకలు ఈరోజు ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన సూర్య నమస్కారాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రథసప్తమిని రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు ప్రభుత్వం అని ఏర్పాట్లు చేసిందని కేంద్రమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

==========================

ఆరోగ్య సమస్యలపై ముందుగానే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలని భీమిలి నియోజకవర్గ శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. విశాఖపట్నం మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ రోజు నిర్వహించిన "యునైటెడ్ బై యూనిక్" వాకథాన్ లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో వైద్య రంగం ఎంతో అభివృద్ధి చెందిందని, వైద్య పరీక్షలకు సంబంధించి నూతన ఆవిష్కరణలు జరిగాయని తెలిపారు.

==========================

రోగ నిర్ధారణలో సాంకేతికతతో పాటుకృత్రిమ మేధ కీలక పాత్ర పోషిస్తుందని ప్రముఖ గుండెవైద్య నిపుణులు డాక్టర్ పి.రమేష్ బాబు చెప్పారు. విజయవాడలో ఈరోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... కేంద్ర బడ్జెట్‌లో వైద్య ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ప్రాథమిక ఆసుపత్రులలో బ్రాడ్ బ్రాండ్ అనుసంధానం, టెలి మెడిసన్, మౌలిక సదుపాయాల విస్తరణ, కృత్రిమ మేధ ఆధారిత సేవలను అందించేందుకు దోహదపడుతుందన్నారు. దేశంలో మెడికల్ పర్యాటకాన్ని ప్రోత్సహించే విధంగా బడ్జెట్ ఉందని రమేష్ బాబు తెలుపుతూ.....

(వాయిస్ 26 సెకన్లు)

విరామం

==========================

కృష్ణా - గుంటూరు శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గానికి ఎన్నికల షెడ్యూల్ విడుదలతో జిల్లాలో ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున రేపు నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక - పీజీఆర్ఎస్ కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించడం జరిగిందని NTR జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా పశ్చిమ గోదావరి జిల్లాలో సైతం పిజిఆర్ఎస్ ను తాత్కాలికంగా రద్దు చేశామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.

==========================

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై ఏలూరు జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ బడ్జెట్ అన్నిరంగాలను ప్రోత్సహిస్తూ వికసిత్ భారత్ దిశగా దేశం అభివృద్ధివైపు పయనింప చేసేదిలా ఉందని అభిప్రాయపడ్డారు. ప్రధానంగా వ్యవసాయ రంగంతో పాటు విద్యారంగం, అంకుర పరిశ్రమలకు, పారిశ్రామిక వేత్తలకు, మధ్యతరగతి ఇలా అన్ని వర్గాలకు ప్రోత్సాహకరంగా ఉందని అభిప్రాయపడుతున్నారు. ఆక్వారంగం ప్రస్తుతం ఉన్న పరిస్థితుల నుండి అభివృద్ధి దిశగా వెళ్లడానికి ఈ బడ్జెట్ ఎంతగానో తోడ్పడుతుందని ఆక్వా రైతు కీర్తి వెంకట రాంప్రసాద్ పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

==========================

రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన వాట్సాప్ ఆధారిత సేవల్లో భాగంగా ఆర్టీసీ బస్ టికెట్లను.. వాట్సాప్ ద్వారా బుక్ చేసుకున్న ప్రయాణికులను బస్సుల్లో అనుమతించాలని యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. దూరప్రాంత బస్ సర్వీసులు అన్నింటా వాట్సాప్ ద్వారా టికెట్ బుకింగ్‌కు అవకాశం కల్పించినట్లు పేర్కొంది. దీనిపై క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించాలని అన్ని జిల్లాల అధికారులు, డిపో మేనేజర్లకు ఆదేశాలిచ్చింది.

==========================

ఈరోజు ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. పర్యావరణ సమతుల్యతను, జీవ వైవిధ్యాన్ని కాపాడడంలో చిత్తడి నేలలు పోషిస్తున్న పాత్రను తెలియచేయడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశ్యం. సముద్ర, నదీ తీర ప్రాంతాల్లో ఎల్లప్పుడూ లేదా ఏడాదిలో ఎక్కువ కాలం నీరు నిలిచి వుండే ప్రాంతాలనే చిత్తడి నేలలని అంటారు. ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు 1997 ఫిబ్రవరి 2వ తేదీ నుండి చిత్తడి నేలల దినోత్సవం నిర్వహిస్తున్నారు. పర్యావరణ వ్యవస్థలో ప్రధానమైన చిత్తడి నేలల్ని సంరక్షించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన ఒక ప్రకటనలో వాటి ప్రాధాన్యాన్ని వివరించారు. విలువైన పర్యావరణ వ్యవస్థల్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందని ఉపముఖ్యమంత్రి సూచించారు.

==========================

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి మేడా వెంకటరావు ఆకాశవాణి విశాఖపట్నం కేంద్ర ప్రాంతీయ వార్తా విభాగానికి తెలియజేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

==========================

ఆంధ్రప్రదేశ్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. 2 సంవత్సరాల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా విశ్రాంత పోలీస్ డైరెక్టర్ జనరల్ ఆర్.పి ఠాకూర్ నియమితులయ్యారు. ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ వేదికగా ఠాకూర్ పనిచేయనున్నారని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

==========================

==========================